కులవృత్తులపై నోరుపారేసుకున్న రేవంత్

బీసీ సంఘాలు, కులవృత్తిదారుల ఆగ్రహం

హైదరాబాద్, మార్చి4 (నమస్తే తెలంగాణ): కులవృత్తులపై సీఎం రేవంత్‌రెడ్డి మరోమారు చులకనభావం ప్రదర్శించారు. ఎల్బీ స్టేడియంలో జరిగిన ఉద్యోగ నియామక పత్రాల పంపిణీ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ''బర్రెలు కాసుకునే వారు బర్రెలు కాసుకోవాలె. గొర్రెలు పెంచుకునే వారు గొర్రెలు కాసుకోవాలె. చేపలు పట్టుకునే వాళ్లు చేపలు పట్టుకోవాలె, చెప్పులు కుట్టేవాళ్లు చెప్పులు కుట్టాలి'' అన్నట్టుగా గత ప్రభుత్వం పథకాలు తీసుకొచ్చిందని, తాము మాత్రం ఉద్యోగాలు ఇస్తున్నామని పేర్కొన్నారు. ఆయన వ్యాఖ్యలపై బీసీ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఎవరికి తోచిన పని, ఎవరికి వచ్చిన, నచ్చిన పని చేసుకుంటే తప్పేమిటని ప్రశ్నిస్తున్నారు. కులవృత్తులను అవమానించిన సీఎం వెంటనే క్షమాపణలు చెప్పాలని ఆయా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

పాతబస్తీ మెట్రోకు 8న శంకుస్థాపన

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 4 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ పాతబస్తీలో మెట్రోరైల్ పనులను చేపట్టేందుకు ముహూర్తం ఖరారైంది. మొదటి దశ మెట్రో ప్రాజెక్టులోని కారిడార్-2లో భాగంగా ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా మధ్య నిర్మించాల్సిన ఈ 5.5 కి.మీ. గ్రీన్‌లైన్ పనులకు సీఎం రేవంత్‌రెడ్డి 8న శంకుస్థాపన చేయనున్నట్టు హైదరాబాద్ మెట్రోరైల్ లిమిటెడ్ (హెచ్ఎంఆర్ఎల్) ఎండీ ఎన్వీఎస్ రెడ్డి సోమవారం ప్రకటించారు. దారుల్‌షిఫా నుంచి ఆలియాబాద్ మీదుగా సాగే ఈ మార్గంలో సాలార్‌జంగ్ మ్యూజియం, చార్మినార్, శాలిబండ, ఫలక్‌నుమా వద్ద 4 మెట్రో స్టేషన్లు ఉంటాయి. పాతబస్తీ కారిడార్‌లో రోడ్ల విస్తరణ వల్ల మొత్తం 1,100 ఆస్తులు ప్రభావితమవుతాయని ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం ఈ మార్గంలోని ప్రతి మెట్రో స్టేషన్ వద్ద 120 అడుగులు, మిగిలిన ప్రాంతాల్లో 100 అడుగుల విస్తీర్ణంతో రోడ్లు ఉండేలా డిజైన్ చేసినట్టు చెప్పారు. మెట్రోరైల్ రెండో దశలో నాగోల్-శంషాబాద్ ఎయిర్‌పోర్టు మార్గంలో చాంద్రాయణగుట్ట వద్ద అనుసంధాన స్తామని వివరించారు. చాంద్రాయణ గుట్ట వద్ద మేజర్ ఇంటర్‌చేంజ్ స్టేషన్‌ను నిర్మించాల్సి ఉంటుందని తెలిపారు.

తెలంగాణకు అన్నివిధాలా సాయం

- గత పదేండ్లలో వేల కోట్లు ఇచ్చాం
- ఆదిలాబాద్‌లో ప్రధాని మోదీ వెల్లడి
- పలు అభివృద్ధి పనుల ప్రారంభం
- రాష్ట్రాభివృద్ధికి పెద్దన్నలా సహకరించాలి
- మోదీకి సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి

ఆదిలాబాద్‌లో వర్చువల్ విధానంలో శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న పీఎం మోదీ, చిత్రంలో రేవంత్‌రెడ్డి, గవర్నర్ తమిళి సై, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ బాపురావు

ఆదిలాబాద్, మార్చి 4(నమస్తే తెలంగాణ): తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహాయ, సహకారాలు అందిస్తున్నదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ చెప్పారు. ఆదిలాబాద్ పర్యటనకు వచ్చిన ప్రధాని మోదీ సోమవారం జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో రూ.56 వేల కోట్ల విలువ చేసే పనులను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశానికి సంబంధించిన ప్రాజెక్టులను ఆదిలాబాద్‌లో ప్రారంభించామని, వీటిలో 30 ప్రాజెక్టులకు సంబంధించిన అభివృద్ధి పనులను జాతికి అంకితం చేశామని తెలిపారు. వీటిలో విద్యుత్తు, పర్యావరణ, రహదారులకు సంబంధించినవి ఉన్నాయని పేర్కొన్నారు. గత పదేండ్లలో రాష్ట్ర ప్రగతికి కేంద్రం వేల కోట్ల రూపాయలను విడుదల చేసిందని చెప్పారు. నాలుగు వేల మెగావాట్ల విద్యుత్తు ప్రాజెక్టును రామగుండంలోని ఎన్టీపీసీలో ఏర్పాటు చేశారని, ఇందులో నిరుడు 800 మెగావాట్ల మొదటి యూనిట్ అందుబాటులోకి వచ్చిందని, సోమవారం మరో 800 మెగావాట్ల రెండో యూనిట్‌ను జాతికి అంకితం చేశామని తెలిపారు.

టీఎస్‌టీపీపీ రెండో యూనిట్ జాతికి అంకితం

జ్యోతినగర్ : తెలంగాణ అవసరాల కోసం పెద్దపల్లి జిల్లా రామగుండం ఎన్టీపీసీలో నిర్మించిన తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు ప్లాంటులో 800 మెగావాట్ల రెండో యూనిట్‌ను ప్రధాని మోదీ జాతికి అంకితం చేశారు. విభజన చట్టం ప్రకారం తెలంగాణకు కేటాయించిన థర్మల్ విద్యుదుత్పత్తిలో ఫేస్-1 కింద ఎన్టీపీసీలో నిర్మించిన 1600 మెగావాట్ల ప్రాజెక్టులో నిరుడు 800 మెగావాట్ల మొదటి యూనిట్ ఉత్పత్తిని ప్రారంభించింది. తాజాగా, మరో 800 మెగావాట్ల రెండో యూనిట్‌ను ప్రధాని మోదీ జాతికి అంకితం చేశారు. ఈ వేడుకను తిలకించేందుకు ఎన్టీపీసీ యాజమాన్యం టౌన్‌షిప్‌లోని కాకతీయ ఫంక్షన్ హాల్‌లో ఎల్ఈడీ స్క్రీన్‌ను ఏర్పాటు చేయగా, ఉద్యోగులు ఉన్నతాధికారులు, ఎన్టీపీసీ కార్మిక సంఘాల నాయకులు తిలకించారు. కాగా, దక్షిణ భారత దేశంలోనే మొదటిసారిగా అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానం కలిగిన ఈ రెండు సూపర్ క్రిటికల్ యూనిట్లను 1600 (800x2) రూ.10,599 కోట్ల వ్యయంతో నిర్మించారు. విభజన చట్టంలోని ఫేజ్-2 కింద చేపట్టనున్న 2400 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మూడు యూనిట్లను కూడా స్థానికంగానే రూ.26,952 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇటీవలే ప్రాజెక్టు కోసం మట్టి నమూనా పరీక్షలు జరిగాయి. ప్రాజెక్టుకు కావాల్సిన పర్యావరణ అనుమతులు, భూసేకరణ, ఇతర పనులపై బ్లూప్రింట్ కూడా సిద్ధం చేశారు. పనులు ముందుకు సాగడం కోసం ప్రధానంగా విద్యుత్తు కొనుగోలుపై ప్రభుత్వాలతో పవర్ పర్చేజ్ అగ్రిమెంట్(పీపీఏ) జరగాల్సి ఉన్నది.

మెట్రో, మూసీ అభివృద్ధికి సహకరించాలి: సీఎం

తెలంగాణ అభివృద్ధి కోసం ప్రధానమంత్రి నరేంద్రమోదీ పెదన్నలా సహాయ, సహకారాలు అందించాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. తెలంగాణ పర్యటనకు వచ్చిన ప్రధానికి నాలుగు కోట్ల మంది ప్రజల తరపున స్వాగతం పలుకుతున్నట్టు తెలిపారు. ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు మాట్లాడుతామని అన్నారు. హైదరాబాద్ మెట్రో, మూసీ నది అభివృద్ధికి కేంద్రం సహకరించాలని కోరారు. హైదరాబాద్‌లో స్కైవేల నిర్మాణానికి రక్షణ శాఖ అనుమతులు ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్, ప్రభుత్వ ప్రధాన కార్యాదర్శి శాంతికుమారి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ సోయం బాపురావు, ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాల్గొన్నారు.

రామోజీరావుతో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ

రామోజీ గ్రూప్ సంస్థల చైర్మన్ రామోజీరావుతో సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం భేటీ అయ్యారు. అదిలాబాద్ నుంచి నేరుగా ఫిల్మ్‌సిటీకి వెళ్లిన ముఖ్యమంత్రి గంటకుపైగా రామోజీరావుతో వివిధ అంశాలను చర్చించారు. కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి, మారిన ప్రజాపాలన విధానాలపై మాట్లాడుకున్నారు. దేశంలో, రాష్ట్రంలో సమకాలీన రాజకీయ పరిస్థితులపై చర్చించారు. కార్యక్రమంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఈనాడు ఎండీ కిరణ్ ఉన్నారు.

- హైదరాబాద్,నమస్తే తెలంగాణ

119 చోట్ల మాడల్ గురుకులాలు

- నిరుద్యోగుల్లో స్ఫూర్తి నింపేందుకు అట్టహాసంగా నియామకపత్రాలు
- 3 నెలల్లో 30 వేలమంది ఉద్యోగాలు
- యువత ఆకాంక్ష నెరవేర్చుతున్నాం
- టీచర్లపై సామాజిక బాధ్యత: సీఎం

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): కొడంగల్ నియోజకవర్గంలో 25 ఎకరాల్లో రూ. 1.50 కోట్లతో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మాడల్ గురుకులాన్ని ఏర్పాటు చేస్తున్నామని, మొత్తం 119 నియోజకవర్గాల్లోనూ అవకాశమున్న చోట ఆ నమూనా క్యాంపస్‌లు ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. లక్షలాదిమంది నిరుద్యోగుల్లో విశ్వాసం నింపి, వారిలో స్ఫూర్తి నింపేందుకే ఉద్యోగ నియామకపత్రాలు అందించే కార్యక్రమాన్ని అట్టహాసంగా చేపడుతున్నామని, అంతేతప్ప ఇందులో ప్రచార యావ లేదని పేర్కొన్నారు. ఎల్బీస్టేడియం వేదికగా జరిగిన కార్యక్రమంలో నూతనంగా నియమితులైన 543 డిగ్రీ కాలేజీ లెక్చరర్లు, 1,463 జూనియర్ కళాశాలల లెక్చరర్లు, 2,632 టీజీటీ, 479 మంది కానిస్టేబుళ్లు, 75 మంది వైద్య సిబ్బందికి సీఎం నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు నెలల కాలంలోనే 30 వేలమందికి ఉద్యోగాలు కల్పించామన్నారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపేది చదువు ఒక్కటేనని, అదొక్కటి ఉంటే ఏ స్థాయికైనా ఎదగవచ్చని సీఎం పేర్కొన్నారు. ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకోవడమంటే సామాజిక బాధ్యతను తీసుకోవడమేనని తెలిపారు. ఉద్యోగ నియామకపత్రాల్లో ఎటువంటి పొరపాట్లు లేకుండా అందేందుకు అధికారులు అహర్నిశలు కృషి చేశారని అభినందించారు. అనంతరం డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు దుద్దిళ్ల, పొన్నం, కొండా, తుమ్మలతోకలిసి అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు.

ఇంగ్లీష్ రాదని వెక్కిరిస్తున్నారు

తనకు ఇంగ్లీష్ రాదని వెక్కిరిస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తాను ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నానని గుర్తు చేశారు. తాను ఈ రోజు రాష్ట్రానికి ముఖ్యమంత్రి స్థానంలో ఉన్నానంటే నాడు ఆ పాఠశాలలో అందించిన విద్యే కారణమని పేర్కొన్నారు. ఎక్కడో చదువుకున్న వారు తనకు ఇంగ్లీష్ రాదని అవహేళన చేస్తున్నారని, ఇంగ్లీష్ అనేది ఓ భాష మాత్రమేనని, అది అభివృద్ధికి ఆటంకం కాదని వివరించారు. ఇకపై, ఇంగ్లీష్ రాదని అవహేళన చేసే పరిస్థితి రావొద్దని, ఉపాధ్యాయులు పిల్లలకు ఇంగ్లీష్ నేర్పాలని సూచించారు

అవినీతిలో ఇండియా కూటమి నేతలు

- వికసిత్ భారత్ కోసం బీజేపీ కృషి
- రాష్ట్రంలో లూట్, జూటా సర్కార్
- ఆదిలాబాద్ సభలో ప్రధాని మోదీ

ఆదిలాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): అవినీతి, కుటంబ పాలనలో ఇండియా కూటమి నేతలు మునిగితేలుతున్నారని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శించారు. తాను వారి కుటుంబపాలనపై సవాల్ విసురుతున్నందున మోదీకి పరివారం లేదని కూటమి నేతలు అంటున్నారని, దేశంలో కోట్లాది మంది ప్రజలు తనను కుటంబ సభ్యుడిగా ప్రేమిస్తారని అన్నారు. 'మేరా భారత్ మేరా పరివార్' అనే భావనతో జీవిస్తున్నానని తన జీవితం విచ్చుకున్న దారం లాంటిదని అన్నారు. బీజేపీ విజయ సంకల్ప యాత్రలో భాగంగా సోమవారం ఆదిలాబాద్ ఇందిరా ప్రియదర్శిని మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని పాలించిన పార్టీలు వేర్వేరు కావచ్చని, కానీ వాటి చరిత్ర ఒకటేనని, ఒకటి జూటా అయితే రెండోది లూట్ సర్కార్ అని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆ అవినీతిపై విచారణ జరుపాల్సింది పోయి ఫైళ్లు మూసివేసిందని ఆరోపించారు. రామ మందిర నిర్మాణంలో బంగారు తలుపులు, ధ్వజస్తంభం నిర్మాణంలో తెలంగాణ పాత్ర ఉందని అన్నారు. దేశ ప్రజలు తెలంగాణ ప్రజలను అభినందిస్తున్నారని, రామ్‌లల్లా ఆశీర్వాదం తెలంగాణ ప్రజలపై ఉన్నదని చెప్పారు. తెలంగాణ భూమి రాంజీ గోండ్, కుమ్రం భీం లాంటి వీరులు జన్మించిన స్థలమని, కానీ గత ప్రభుత్వాలు వీరిని గుర్తించలేదని అన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆదివాసులకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చిందని, ఆదివాసీ మహిళను రాష్ట్రపతిని చేశామని గుర్తుచేశారు. బిర్సా ముండా జన్మదినాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నామన్న ప్రధాని, గిరిజనుల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేశామని చెప్పారు. హైదరాబాద్‌లో కడుతున్న మ్యూజియంకు రాంజీగోండ్ పేరు పెడుతామని చెప్పారు. సమక్క, సారక్క యూనివర్సిటీతో పాటు తెలంగాణ రాష్ట్రవాసుల కలగా ఉన్న పసుపు బోర్డును ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. 'వికసిత్ భారత్, వికసిత్ తెలంగాణ నినాదంతో ముందుకు పోతున్నాం. నేను మీ ప్రేమ కోసం తపిస్తున్నాను. ఒక సేవకునిగా పనిచేసే అవకాశం కల్పించండి' అని అన్నారు.

కసిత్ ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ పర్యటన

ఇది ఎన్నికల సభ కాదని, ఇంకా ఎన్నికల ప్రకటన వెలువడలేదని మోదీ గుర్తుచేశారు. తాను తెలంగాణ అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్ల మధ్య ఉత్సవాలను జరుపుకునేందుకు వచ్చానని చెప్పారు. వికసిత్ భారత్ నిర్మాణానికి 15 లక్షల మంది తమ సూచనలు అందజేయగా.. 3 వేల సమావేశాలు ఏర్పాటు చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, ఎంపీ సోయం బాపురావు, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, మహేశ్వర్‌రెడ్డి, రామారావు పటేల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాజ్‌భవన్‌లో ప్రధాని బస

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ) : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోమవారం రాత్రి హైదరాబాద్‌కు చేరుకున్నారు. అదిలాబాద్ బహిరంగ సభ అనంతరం మహారాష్ట్ర పర్యటనకు వెళ్లిన మోదీ.. తిరిగి రాత్రి హైదరాబాద్‌కు చేరుకుని రాజ్‌భవన్‌లో బస చేశారు. మంగళవారం ఉదయం ఆయన సికింద్రాబాద్ మహంకాళి ఆలయాన్ని సందర్శించుకుని, అనంతరం సంగారెడ్డిలో నిర్వహించే వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

ఉద్యోగాల్లో మహిళలకు అన్యాయం

- జీవో నంబర్-3ని వెంటనే రద్దుచేయాలి
- 8న ధర్నా చౌక్‌లో నిరసన
- మోదీ పెద్దన్న ఎప్పడయ్యారు?
- కాంగ్రెస్‌కు రైతుల ఉసురు తగులుతుంది
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

విలేకరులతో మాట్లాడుతున్న కవిత

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): ఉద్యోగ నియామకాల్లో మహిళలకు తీవ్ర అన్యాయం చేస్తున్న జీవో నంబర్-3 ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అంతర్జాతీయ మహిళా దినోత్సవమైన 8న ధర్నాచౌక్‌లో నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేయనున్నట్టు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, భారత జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలిపారు. ఈ ధర్నాకు అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. సోమవారం తన నివాసంలో ఆమె మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం చేపడుతున్న ఉద్యోగ నియామకాలన్నీ కేసీఆర్ చేపట్టినవేనని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో మహిళలకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదని, ఇటీవల తీసుకొచ్చిన జీవో నంబర్-3ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రోస్టర్ విధానంతో ఎక్కువమంది మహిళలకు ఉద్యోగాలు రాకుండాపోయే ప్రమాదం ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ తీరువల్ల 626 గురుకుల ఉద్యోగాల్లో మహిళలకు 77 (12శాతం) మాత్రమే వచ్చాయని పేర్కొన్నారు.

పైసా ఇవ్వకున్నా పెద్దన్న అయ్యారా?

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు ఒక్క రూపాయి కూడా విదిలించని ప్రధాని మోదీ పెద్దన్న ఎలా అయ్యారో చెప్పాలని సీఎంను కవిత ప్రశ్నించారు. మోదీని పెద్దన్న అని సంబోధించడం ద్వారా బీజేపీ-కాంగ్రెస్ ఒకటేనన్న విషయం తేటతెల్లమైనదని తెలిపారు. ఓటుకు నోటు కేసులో రేవంత్ మొదటి ముద్దాయిగా ఉన్నారని, ఆ కేసు విచారణను కేంద్రం వేగవంతం చేయాలని కోరారు. సోనియాను బలిదేవత అన్న రేవంత్‌రెడ్డి ఇప్పుడు సోనియా, రాహుల్‌గాంధీని రాష్ట్రం నుంచి పోటీ చేయాలని కోరుతున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణకు కాంగ్రెస్ పార్టీ చేసిన అన్యాయాన్ని గుర్తుపెట్టుకొని వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీని ఓడించాలని పిలుపునిచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి సాగునీరు వదలకుండా రైతులకు ప్రభుత్వం అన్యాయం చేస్తున్నదని దుయ్యబట్టారు. నీరు ఇచ్చే అవకాశం ఉండీ ఇవ్వకపోవడం రైతులపై కక్ష సాధింపు తప్ప మరోటి కాదని మండిపడ్డారు. కాంగ్రెస్‌కు రైతుల ఉసురు తప్పక తగులుతుందని కవిత పేర్కొన్నారు.

కాంగ్రెస్-బీజేపీ చీకటి ఒప్పందం బహిర్గతం

- మోదీ ఆదిలాబాద్ పర్యటనతో కాంగ్రెస్-బీజేపీ దోస్తానా బయటపడింది
- బడేభాయ్-చోటాభాయ్‌ది రహస్య ఒప్పందం
- లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే విజయం
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలంగాణ పర్యటనతో కాంగ్రెస్-బీజేపీ చీకటి ఒప్పందం బహిర్గతమైందని, బడేభాయ్-చోటాభాయ్ రహస్య బంధం బయటపడిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. ప్రధాని ఆదిలాబాద్ పర్యటన బీజేపీ-కాంగ్రెస్ అలయ్-బలయ్‌లా సాగిందని విమర్శించారు. ఎంపీ పసునూరి దయాకర్‌తో కలిసి సోమవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోదీని రేవంత్‌రెడ్డి పెద్దన్నగా సంబోధించడం ద్వారా ఇన్నాళ్ల కాంగ్రెస్-బీజేపీ బంధం బయటపడిందని పేర్కొన్నారు. గతంలో బీఆర్ఎస్ పంపిన ఎమ్మెల్సీ పేర్లను తిరస్కరించిన గవర్నర్.. కాంగ్రెస్ పంపగానే ఆమోదించారని, ఎఫ్ఆర్ఎంబీ రుణం విషయంలో ప్రధాని మోదీ కూడా ఇలాగే వ్యవహరించారని దుయ్యబట్టారు. రెండు పార్టీల మధ్య ఉన్న చీకటి ఒప్పందానికి ఇంతకుమించిన ఉదాహరణ ఇంకేం కావాలని ప్రశ్నించారు. తెలంగాణకు మోదీ ఒక్క పైసా ఇవ్వకున్నా రేవంత్ ఏమీ అనరని, కానీ కేసీఆర్‌పై మాత్రం ఒంటికాలితో లేస్తున్నారని మండిపడ్డారు. లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తర తెలంగాణలో బీజేపీకి, దక్షిణ తెలంగాణలో కాంగ్రెస్‌కు సహకరించాలన్న పరస్పర ఒప్పందం ఇరుపార్టీల మధ్య జరిగిందని ఆరోపించారు. గత ఎన్నికల్లో నిజామాబాద్, కరీంనగర్.. హుజూరాబాద్, మునుగోడులోనూ ఇదే జరిగిందని పేర్కొన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అత్యధిక స్థానాలను గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.

రాహుల్ నై.. రేవంత్ జై

ప్రధాని మోదీ, అదానీ, బీజేపీపై రాహుల్ ఆరోపణలు చేస్తుంటారని, రేవంత్‌రెడ్డి మాత్రం వారితో దోస్తానా చేస్తారని పల్లా ఆగ్రహం వ్యక్తం చేశారు. గుజరాత్‌ను రాహుల్ విఫల మోడల్‌గా పేర్కొంటే రాహుల్ మాత్రం దానినే తెలంగాణ అమలు చేస్తామని అంటున్నారని ఎద్దేవా చేశారు. రాహుల్ నో అంటే రేవంత్ ఎస్ అంటున్నారని విమర్శించారు. కాళేశ్వరంలో అవినీతి జరగలేదని పార్లమెంటులోనే చెప్పిన కేంద్రం ఇప్పుడు మాత్రం అవినీతి జరిగిందని అంటున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంటు ఎన్నికల బరిలో నిలిపేందుకు కాంగ్రెస్, బీజేపీకి అభ్యర్థులు లేకపోవడంతో తమ ఎంపీలు, నాయకులను బతిమలాడి, ప్రలోభపెట్టి వారి పార్టీలోకి తీసుకుంటున్నారని పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆరోపించారు.

బీజేపీ గెలుపునకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి

- బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి4 (నమస్తే తెలంగాణ) : మరోసారి మోదీ ప్రధాని కావాలని బీజేపీ నేతల కన్నా ఎక్కువగా సీఎం రేవంత్‌రెడ్డి కాళ్లకు బలపం కట్టుకొని తిరుగుతున్నారని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహార శైలిపై ఆయన ధ్వజమెత్తారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేస్తే లాభం లేదని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పకనే చెబుతున్నారని పేర్కొన్నారు. 'రాబోయే రోజుల్లో మీ సహకారం అవసరం' అని అధికారిక కార్యక్రమంలో స్వయంగా ప్రధాని మోదీని కోరడంలో ఆంతర్యం అదేనని విశ్లేషించారు. లోక్‌సభ ఎన్నికల్లో సొంత పార్టీ కేంద్రంలో అధికారంలోకి రావాలనే ఆశ, వస్తుందనే భరోసా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డికి లేదని విమర్శించారు. రాష్ట్రంలో సీఎం కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేస్తున్నారా? బీజేపీ కోసం పనిచేస్తున్నారో ఆ పార్టీ నేతలే తేల్చుకోవాలని సూచించారు.

ఇందిరమ్మ ఇండ్లు ఎప్పుడిస్తారు?

- బోధన్ ఎమ్మెల్యేను ప్రశ్నించిన మహిళలు
- మహిళలపై ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అసహనం

ఎడపల్లి, మార్చి 4: బోధన్ ఎమ్మెల్యే పీ సుదర్శన్‌రెడ్డికి ఊహించని పరాభవం ఎదురైంది. గృహజ్యోతి ప్రారంభానికి వెళ్లిన ఆయనను కొందరు మహిళలు ఇందిరమ్మ ఇండ్లు ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల కేంద్రంలో సోమవారం గృహజ్యోతి కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు జీరో కరెంట్ బిల్లులు అందజేశారు. అనంతరం సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. పేదలకు ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తామని, ముందుగా గ్రామపంచాయతీ కార్మికులకు మంజూరు చేస్తామని ప్రకటించారు. దీంతో అక్కడే ఉన్న కొందరు మహిళలు తమకు ఎప్పుడు ఇస్తారని గట్టిగా నిలదీశారు. వారిపై అసహనం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే.. ఇండ్లు లేని వారికి, ఇండ్లు కూలిపోయిన వారందరికీ తప్పకుండా మంజూరు చేస్తామని బదులిచ్చారు.

ఇందిరమ్మ ఇండ్ల గురించి ప్రశ్నిస్తున్న మహిళలను వారిస్తున్న కాంగ్రెస్ నేతలు

ఏడాదిలో 100 వందేభారత్ రైళ్లు ఏవి?

- ఇప్పటివరకు 50 కూడా ప్రారంభించని కేంద్రం
- తెలంగాణలో కేవలం మూడు రైళ్లే ప్రారంభం
- చెన్నై ఆర్‌సీఎఫ్‌లో నత్తనడకన కోచ్‌ల తయారీ
- కాజీపేట్‌లో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు కేంద్రం ససేమిరా

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): రైల్వే ప్రయాణికులకు అత్యాధునిక సౌకర్యాలతో ప్రయాణ సౌకర్యం కల్పించాలన్న ఉద్దేశంతో కొత్తగా ప్రవేశపెట్టిన వందేభారత్ రైళ్ల సంఖ్య ఏడాది దాటినా అంతంత మాత్రంగానే ఉన్నది. ఏటా 100 వందే భారత్ రైళ్లను ప్రారంభిస్తామని నిరుడు ఎంతో ఆర్భాటంగా ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం.. ఇప్పటివరకు 50 రైళ్లను కూడా ప్రారభించలేదు. వందేభారత్ రైళ్ల విషయంలో కేంద్రం దక్షిణ మధ్య రైల్వే జోన్‌కు, ముఖ్యంగా తెలంగాణకు తీవ్ర అన్యాయం చేస్తున్నది. ఉత్తర భారతావనిలోని వివిధ ప్రాంతాల మధ్య అనేక వందేభారత్ రైళ్లను నడుపుతున్న నరేంద్రమోదీ సర్కారు.. తెలంగాణ ప్రాంతంలో కేవలం 3 రైళ్లను ప్రారంభించి చేతులు దులిపేసుకున్నది. దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో అత్యంత కీలకమైన హైదరాబాద్/సికింద్రాబాద్ నుంచి పలు ప్రాంతాలకు వందేభారత్ రైళ్లను ఏర్పాటు చేయాలన్న డిమాండ్లను కేంద్రం ఏ మాత్రం పట్టించుకోవడం లేదు.

నత్తనడకన వందేభారత్ కోచ్‌ల తయారీ

ప్రస్తుతం వందేభారత్ రైళ్ల బోగీలను చెన్నైలోని రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో మాత్రమే తయారు చేస్తున్నారు. కానీ, ఆ ఫ్యాక్టరీ సామర్థ్యం చాలా తక్కువగా ఉండటంతో వారానికి ఒక బోగీ మాత్రమే తయారవుతున్నట్టు సమాచారం. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం తెలంగాణలోని కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ (ఆర్‌సీఎఫ్)ని ఏర్పాటు చేయాల్సి ఉన్నది. అందుకు తొలుత అంగీకరించిన కేంద్రం.. ఆ తర్వాత మాట మార్చింది. కాజీపేటలో ఆర్‌సీఎఫ్‌